
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY

5



నాగర్‌కర్నూల్

జిల్లా వార్తలు

ఆదివారం 8 జూన్ 2025



పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద భట్టికి స్వాగతం పలుకుతున్న ఏపీ కాంగ్రెస్ నాయకులు

కర్నూలు పర్యటనకు భట్టి

- సరిహద్దులో ఏపీ నాయకుల స్వాగతం

అలంపూరుచౌరస్తా, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంతి భట్టి విక్రమార్క శనివారం కర్నూలు పర్యటనకు వెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ ఆంధ్ర ప్రదేశ్ నాయకులు పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికారు. కర్నూలు జిల్లాలోని పిన్నాపురం వద్ద నిర్మిస్తున్న సోలార్ ప్రాజెక్టును పరిశీలించేందుకు ఆయన వెళ్తున్నట్లు తెలిపారు. అనంతరం పలు సాగునీటి ప్రాజెక్టులను పీసీసీ ఏపీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతో కలిసి పరిశీలించనున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి



నాగర్‌కర్నూల్ పట్టణంలోని ఈద్గా వద్ద నమాజ్ చేస్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి



శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం ముస్లింలు బక్రీద్‌ను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని శ్రీపురంలో రోడ్డు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జామియా అరబిక్ యూనివర్సిటీ మౌలానా అలీం హఫీజ్ మహమ్మద్ షాకీర్ సిద్దిఖీ పండుగ ప్రాముఖ్యతను వివరించారు. ఈద్గా వద్దకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఇతర ప్రజా ప్రతినిధులు చేరుకొని ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలుపుతూ పంపిన సందేశాన్ని ఈద్గా వద్ద ముస్లిం మత పెద్దలు వివరించారు. కార్యక్రమంలో వక్ఫ్ కమిటీ, మజీద్ కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, వివిధ పార్టీల ప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, వివిధ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నేడు మృగశిర కార్తె

- ప్రారంభం కానున్న వ్యవసాయ పనులు
- మాంసం, మద్యంతో విందు
- పెరిగిన నాటుకోళ్ల ధరలు

పెద్దకొత్తపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మృగశిర కార్తె ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. కొన్ని ప్రాంతాల్లో ఈ కార్తెను మెరుగు కార్తెగా పిలుస్తుంటారు. జూన్ మొదటి వారంలో వచ్చే ఈ కార్తెతో రోహిణి కార్తెలో భానుడి భగభగల నుంచి ప్రజలు ఉపశమనం పొందుతారు. ఈ కార్తెను గ్రామాల్లో పెద్ద పండుగగా జరుపుకొంటారు. ప్రత్యేకంగా నాటుకోళ్ల వంటకాలకు మొగ్గుచూపుతారు. వేసవి కాలం ముగిసి వర్షాకాలంలో వచ్చే చలిని తట్టుకునేందుకు నాటుకోడి మాంసం, ఇంగువ బెల్లం తింటామని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నాటుకోడికి డిమాండ్..

మృగశిర కార్తె చేసుకునే వారికి పెరిగిన కోళ్ల ధరలు భారంగా మారాయి. నాటుకోడి కిలో రూ.700 నుంచి రూ.800 పలుకుతున్నాయి. అంత ధర పెట్టినా కోళ్లు దొరకడం లేదు. ఫారం కోళ్ల లైవ్ ధర కిలో రూ.140వరకు ఉంది. చికెన్ కిలో రూ.200 ధర ఉండగా స్కిన్‌లెస్ కిలో రూ.220 పలుకుతోంది.

తూడుకుర్తిలో సైనికుడికి సన్మానం

- ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ముజీబ్ ఉర్ రెహమాన్
- బక్రీద్ కోసం స్వగ్రామానికి రాక
- మస్జిద్ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘన సన్మానం

6

మెరుగైన ఫలితాల కోసం.. వినూత్నమైన ప్రయోగాలు

- 'ఆంధ్రజ్యోతి'తో డీఈవో ఎ.రమేశ్‌కుమార్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాగర్‌కర్నూల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాభిమానుల సహకారంతో వినూత్నమైన ప్రయోగాలు చేపట్టనున్నట్లు విద్యాశాఖ అధికారి ఎ.రమేశ్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు జూన్ 12న పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

విద్యాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

క్షేత్రస్థాయిలో లోటుపాట్లను గమనించి వెనువెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకున్నందున రాష్ట్రంలో పదోతరగతి ఫలితాల్లో 13వ స్థానంలో నిలిచాం. అందరి సహకారంతో జిల్లాను ఒకటి నుంచి ఐదోస్థానం లోపల నిలపాలనేది నా సంకల్పం. ఆ దిశగా చర్యలు ప్రారంభించాం.

మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయట..

అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ కూడా సంపూర్ణంగా సహకరిస్తున్నారు. 770 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అక్కడ రక్షిత మంచినీరు, టాయిలెట్ల వసతి కల్పించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నాం.

తరగతి గదుల్లో టీచర్లు సెల్‌ఫోన్లు వినియోగిస్తున్న మాట వాస్తవమేనా?

ఈ అంశంలో కొన్ని ఆరోపణలు వచ్చిన విషయం నిజమే. ఈ విద్యా సంవత్సరం నుంచి కచ్చితంగా విద్యాబోధన సమయంలో తరగతి గదిలోకి సెల్‌ఫోన్‌ను అనుమతించే అవకాశమే లేదు.

విద్యార్థులకు యూనిఫామ్, నోటు పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా..?

నాగర్‌కర్నూల్ జిల్లాలో 770 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. విద్యా సంవత్సరం పునఃప్రారంభం రోజే పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు ఒక జత యూనిఫామ్ కచ్చితంగా అందజేస్తాం.

కొత్తగా డిజిటల్ క్లాసులు ప్రారంభించే విషయం వాస్తవమేనా?

ఈ అంశం ముమ్మాటికీ నిజం. ప్రతీ క్లాసులో విద్యార్థి ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గ్రేడింగ్‌ను నిర్ణయిస్తున్నాం. దాని ఆధారంగా శిక్షణ ఇస్తాం. భవిష్యత్తులో ఖాన్ అకాడమీ ద్వారా వారికి సివిల్ సర్వీస్‌కు సంబంధించిన శిక్షణ కూడా ఇవ్వనున్నాం.

నకిలీ విత్తనాలపై.. నిఘా

- దుకాణాలను తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందాలు
- నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్టు, లైసెన్స్ రద్దుకు చర్యలు

వనపర్తి జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కలెక్టర్ ఆదర్శ్‌సురభి నేతృత్వంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన రెండు బృందాలను ఏర్పాటు చేసి జిల్లాలోని విత్తన దుకాణాలు తనిఖీ చేస్తున్నారు. ఎవరైనా నకిలీ విత్తనాల విక్రయిస్తే కేసు నమోదుతో పాటు దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అదేవిధంగా రైతులు నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోకుండా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. - వనపర్తి, ఆంధ్రజ్యోతి



ఆత్మకూరులోని ఓ దుకాణంలో విత్తనాల ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ, వ్యవసాయ శాఖ అధికారులు

6

రేపటి నుంచి అంతర్ జిల్లా మహిళల క్రికెట్ లీగ్

- హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహణ

- తలపడనున్న మూడు జట్లు
- ప్రతిభ కనబరిస్తే ఉమ్మడి జట్టుకు ఎంపిక
- టోర్నీని ప్రారంభించనున్న ఎండీసీఏ ప్రతినిధులు



ఉమ్మడి జిల్లా టోర్నీకి ఎంపికైన మహిళా క్రికెటర్లు(ఫైల్)

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో హెచ్‌సీఏ అంతర్ జిల్లా మహిళల క్రికెట్ లీగ్ నిర్వహించనున్నారు. మహిళా క్రికెటర్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మొదటి టోర్నీ నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 2డే, వన్ లీగ్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రతిభ కనబరిచిన 60 మందిని ఎంపిక చేసి రెడ్, బ్లూ, పింక్ మూడు జట్లుగా విభజించారు. 30 ఓవర్ల మ్యాచ్‌లు, ఒక్కో

-మిగతా 6లో..

లక్ష్యం 610 మిలియన్ యూనిట్లు

- జూరాలలో ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి
- ఇన్‌ఫ్లో ఆధారంగా ఉత్పత్తి పెంచే అవకాశం

7



దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్న టర్బైన్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సీఐ విజయ్‌సింహా

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- గద్వాల డీవైఎస్‌వో జితేందర్
- ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు

7



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

పానీపూరి తిని అస్వస్థత

- ఆసుపత్రి పాలైన ఆరుగురు
- ఒకరి పరిస్థితి ఆందోళనకరం

7

బయోచార్‌తో.. నేలకు జీవం



- పంట వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ

- కాల్చిన బొగ్గు, పుట్టమట్టితో తయారు
- బయోచార్‌తో 30 శాతం అధిక దిగుబడి
- చిన్న, సన్నకారు రైతులకు ఎంతో మేలు..

వ్యవసాయంలో కాలానుగుణంగా అనేక మార్పులు వస్తున్నాయి. రైతులు రోజుకొక కొత్త పద్ధతి పాటించి పంటలు సాగుచేస్తున్నారు. దానికి కొనసాగింపు రసాయన ఎరువుల వాడకం అదేస్థాయిలో పెరుగుతోంది. దానివల్ల భూమిలోని సారం దెబ్బతిని.. పంట దిగుబడిపై తీవ్రప్రభావం చూపుతోంది. సారం కోల్పోయిన భూమికి పునరుజ్జీవం కల్పించడం ఒక్కటే మార్గం. గతంలో వినియోగించినా.. నేడు కనుమరుగైన "బయోచార్" విధానాన్ని పునఃవినియోగం చేయాలి. వ్యవసాయ అవశేషాలతో రైతులే ఈ ఎరువును తయారుచేసి పంటలకు వేస్తే వ్యవసాయం లాభసాటిగా మారనుంది.

- పాలమూరు, ఆంధ్రజ్యోతి

6





సీటు కోసం.. మహిళల కొట్లాట

ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసేందుకు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన మహిళలు

7

- పోలీస్ స్టేషన్ ముందు బస్సు ఆపిన డ్రైవర్
- ఒకరిపై ఒకరు ఫిర్యాదు

ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం

-ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి

బిజినేపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతీమాట నిలబెట్టుకుంటామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆయా గ్రామాలకు చెందిన 567 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసిడింగ్స్ అందజేసి మాట్లాడారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, నాయకులు అవంతి శంకర్, అమృత్‌రెడ్డి, గంగనమోని తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన

- హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



ఉత్సవాలను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

పాన్‌గల్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బొడ్రాయి, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన వైభవంగా సాగుతున్నాయి. వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలోని గోప్లాపూర్ గ్రామంలో మూడు రోజుల నుంచి ఈ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. అదేవిధంగా సత్యనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ... ప్రజలు ఐక్యమత్యంతో కలిసి మెలసి జీవించాలని, ఈ వేడుకలు భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. జీవితంలో మంచి చెడులే ఉంటాయని, మంచి చేస్తే వారిపేరు చిరస్థాయిగా నిలుస్తుందని తెలిపారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ... మత సామరస్యానికి చిహ్నంగా బక్రీదు, ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠాపన జరగడం శుభ సూచకమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, కాంగ్రెస్ నాయకులు కేతేపల్లి రవి, వెంకటేష్ నాయుడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బయోచార్‌తో .. నేలకు జీవం

పంట వ్యర్థాలతో సేంద్రియ ఎరువు తయారీ





మిడ్జిల్ మండలం కొత్తూరులో బయోచార్ తయారు విధానంపై వ్యవసాయాధికారులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ ఎన్.సాయిభాస్కర్‌రెడ్డి (ఫైల్)

పాలమూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు వాడకుండా పంటలు పండించలేమనే భావన నేడు చాలా మంది రైతుల్లో నెలకొంది. ఏ పంట అయినా రసాయన ఎరువుల వినియోగం తప్పనిసరి అయ్యింది. ఇదే పద్ధతిలో రసాయన ఎరువుల వినియోగిస్తే భవిష్యత్తులో నేల జీవం కోల్పోయి.. వ్యవసాయం చేయటానికి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన కొన్ని సంస్థలు బయోచార్ విధానంతో సేంద్రియ ఎరువుల తయారీకి శ్రీకారం చుట్టాయి. ఈ విధానాన్ని పూర్వకాలంలో ఉపయోగించేవారు. నేడు రసాయనాల వాడకం మాయలో పడటం వల్ల అది కనుమరుగైంది. బయో అంటే జీవం..చార్ అంటే బొగ్గు.. బొగ్గుతో భూమికి జీవం పోయడమే బయోచార్‌గా పిలుస్తున్నారు.

30 శాతం అధిక దిగుబడి

సుమారు 30 నుంచి 40 ఏళ్ల క్రితం రైతులు పశువుల మల, మూత్రాలను ప్రతీరోజు తీసి పెంటగా వేసేవారు. ఆరునెలలు, ఏడాదికి ఒకసారి దానినే తీసి పంటకు ఎరువుగా వేసేవాళ్లు. భూమికి సారం అంది దిగుబడి బాగా వచ్చేది. ఈనాడు రైతులు పశువులను తీసివేయటం, యంత్రాలతో వ్యవసాయం చేయటంతో ఆ ఎరువు లభించడం లేదు. దీంతో రైతులు రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. దీంతో భూమి సారం కోల్పోయింది. నేలను సారవంతం చేసేందుకు మళ్లీ పాత విధానాన్ని తీసుకురావటమే బయోచార్ విధానం. రైతులు బయోచార్ ఉపయోగించటంతో నేడు పండించే దానికంటే 30శాతం అధిక దిగుబడిని పొందవచ్చు. ఇలాంటి ఎరువు వాడటంతో మొక్కలకు పోషకాలు అంది దిగుబడి కూడా పెరుగుతోంది. చిన్న, సన్నకారు రైతులకు ఇది చాలా ఉపయోగం. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, లాభాలు పొందాలని రాష్ట్రంలో కొన్ని ప్రైవేట్ సంస్థలు శ్రీకారం చుట్టాయి. పల్లెల్లో బయోచార్ పరిశ్రమలను విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటే రైతులకు మేలు జరుగుతోంది.

తయారు చేయడం ఎలా....?

బయోచార్‌ను అనేక రకాలుగా తయారు చేయవచ్చు. బాగా ఎండిన కట్టెలకు బెరడు తీసేసి ఒక డబ్బలో కానీ, గొతిలో కాని వేసి కాల్చాలి. కట్టె మొత్తం కాలి మంటలు నీలిరంగులోకి మారిన తరువాత నీటితో ఆర్పేయాలి. కట్టె బొగ్గు రూపంలోకి మారినప్పుడు తీసుకొని పౌడర్‌గా చసుకొని పుట్టమన్ను, పశువుల ఎరువులో కలిపి మొక్కలకు వేసుకోవాలి. ఎకరాకు 250 నుంచి 300 కిలోల వరకు దుక్కిలో వేసి కలియదున్నాలి. పండ్ల తోటల చెట్లకు ఒక్కొ చెట్టుకు 3 కిలోల వర కు వేసుకోవచ్చు. బయోచార్‌కు సర్కారు తుమ్మ బొగ్గు వాడుకుంటే మేలుగా ఉంటుంది.

బయోచార్‌తో భూమి సారవంతంగా మారుతుంది



బయోచార్ ఎరువు వాడకంతో భూమి నాణ్యత పెరుగుతుంది. పశువులు తగ్గడంతో బయోచార్ ఎరువుల వాడకం తగ్గింది. రసాయన ఎరువులతో భూమి సారం కోల్పోయి భవిష్యత్తులో పంటలు సాగుచేయటానికి పనికిరావు. హార్ట్‌ఫుల్‌నెస్, పేపాల్ సంస్థలు బయోచార్ ఎరువులపై అవగాహన కల్పిస్తున్నారు. వ్యవసాయ అధికారులు కూడా శిక్షణ కార్యక్రమాలు హాజరయ్యారు. గ్రామాల్లో బయోచార్ పరిశ్రమనుల ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

పి.శ్రీనివాసులు, ఏడీఏ, మహబూబ్‌నగర్

పంట వ్యర్థాలతో ఎరువు చేయవచ్చు



మా పొలంలో బయోచార్ విధానం అమలు చేయాలని ఉంది. దానికోసం బెంగుళూరు నుంచి మిత్రులతో బొగ్గు తీసుకువచ్చాను. ఈ ఏడాది బయోచార్ విధానం అమలు చేయాలనుకున్నా. ఉమ్మడి జిల్లాకు చెందిన స్వతంత్ర్యం శాస్త్రవేత్త డాక్టర్ నక్కా సాయిభాస్కర్‌రెడ్డితో అనుబంధం ఉంది.

- జ్ఞానేశ్వర్, రైతు, మహబూబ్‌నగర్

బయోచార్ పాతపద్ధతే

బయోచార్ విధానం పాతదే కొత్తదేమి కాదు. 30 ఏళ్లక్రితం గ్రామాల్లో ప్రజలు కట్టెలపొయ్యిమీదనే వంటచేసేవారు. పొయ్యిలో వచ్చిన బొగ్గునే పెంటలో వేసేవారు. ఆరునెలలు, ఏడాదంతా పెంటలో మగ్గిన పశువుల పెండ, బొగ్గు, బూడిద, గడ్డి ఇతరత్రా వ్యర్థాలు ఎరువుగా తయారయ్యేవి. ప్రస్తుతం పశువులు లేవు, కట్టెల పొయ్యిలు లేవు.. బొగ్గు, పేడ ఎక్కడినుంచి వస్తాయి. అందుకే ఇప్పుడు వ్యవసాయ వ్యర్థాలను కాల్చి వచ్చే బొగ్గుతో బయోచార్ ఎరువును తయారు చేస్తున్నారు. మొదటగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మిడ్జిల్ మండలం, కొత్తూరులో తయారు చేశారు.

- డాక్టర్ ఎన్. సాయిభాస్కర్‌రెడ్డి, చీఫ్ క్లైమెట్ ఇంజనీరింగ్ అఫీసర్

జూరాల, శ్రీశైలం ప్రాజెక్టులకు స్వల్పంగా ఇన్‌ఫ్లోలు

ధరూరు/దోమలపెంట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు స్వల్పంగా నమోదవుతున్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద పూర్తిస్థాయిలో తగ్గుముఖం పడుతుండటంతో జెన్‌కో జల విద్యుత్ కేంద్రం నుంచి అధికారులు విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. శనివారం ఎగువన ఆల్మటి జలాశయంలో 58 టీఎంసీ ల నీరు ఉండగా, నారాయణపూర్ జలాశయంలో 29 టీఎంసీల నీరు ఉన్నది. జూరాల జలాశయంలో 317.970 మీటర్లలో 4.844 టీఎంసీల నీరు ఉన్నది. 7,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, నెట్టెంపాడు లిఫ్ట్ కెనాల్‌కు 1500 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్-1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్ట్ కెనాల్‌కు 315 క్యూసెక్కులతో మొత్తంగా 2,533 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జూరాల అధికారులు తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన ఉన్న సుంకేసుల నుంచి 1,368 క్యూసెక్కుల నీరు వస్తుండగా, శనివారం ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 885 అడుగులకు గాను, 835.40 అడుగులలో 215.807 టీఎంసీల సామర్థ్యానికి గాను 55.5655 టీఎంసీల నీటి నిల్వలు నమోదైనట్లు డ్యాం గేజింగ్ అధికారులు చెప్పారు. గడిచిన 24 గంటల వ్యవధిలో కుడిగట్టు విద్యుత్ కేంద్రంలో 1,467 క్యూసెక్కుల నీటిని వినియోగించి 1.712 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో 4,815 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 2.243 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగించారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 6,565 క్యూసెక్కుల నీటిని విద్యుత్ ఉత్పాదనతో సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

ఓపెన్ పది, ఇంటర్ ఫలితాలు విడుదల

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ పది, ఇంటర్మీడియట్ పరీక్ష పరీక్షలు ఫలితాలు శనివారం విడుదయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదవ తరగతిలో 71.94 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్మీడియట్‌లో 65.82 శాతం మంది ఉతీర్ణత సాధించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 559 మంది అభ్యర్థులు పరీక్ష రాయగా, 374 మంది అభ్యర్థులు పాస్ అయ్యారు.

జోగులాంబ గద్వాల జిల్లాలో 455 మంది పరీక్ష ,రాయగా 225 మంది ఉత్తీర్ణులయ్యారు. వనపర్తి జిల్లాలో 326 మందికి గాను, 289 మంది పాస్ అయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 353 మంది పరీక్ష రాయగా, 235 మంది పాస్ అయ్యారు. ఇంటర్మీడియట్‌లో మహబూబ్‌నగర్ జిల్లా నుంచి 841 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కాగా, 490 మంది పాస్ అయ్యారు. జోగులాంబ గద్వల జిల్లాలో 652 మంది పరీక్ష రాయగా, 412 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వనపర్తి జిల్లాలో 510 మంది పరీక్ష రాయగా, 370 మంది పాస్ అయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి 746 మందికి గాను, 546 మంది ఉత్తీర్ణత సాధించారు. నారాయణపేట జిల్లాలో 897 పరీక్ష రాయగా, 528 పాస్ అయ్యారు.

తూడుకుర్తిలో సైనికుడికి ఘన సన్మానం

- ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ముజీబ్ ఉర్ రెహమాన్
- బక్రీద్ కోసం స్వగ్రామానికి రాక
- మస్జీద్ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘన సన్మానం



మాజీ సైనికుడు ముజీబ్ ఉర్ రెహమాన్‌ను సన్మానిస్తున్న తూడుకుర్తి గ్రామస్థులు

కందనూలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తూడుకుర్తి గ్రామంలో సైనికుడు ముజీబ్ ఉర్ రెహమాన్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా విధులు నిర్వహించి ఇటీవల బక్రీద్ పండుగ కోసం సెలవుపై స్వగ్రామానికి వచ్చిన ఆయనను మస్జిద్ కమిటీ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శనివారం ఈద్గాలో సన్మానించారు. మస్జీద్ కమిటీతో పాటు గ్రామ మాజీ ఉప సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం చేపట్టినట్లు మస్జీద్ కమిటీ బాధ్యులు మహమ్మద్ ఖాజా తెలిపారు. దేశం కోసం నిబద్ధతతో ఆపరేషన్ సిందూరులో భాగస్వామిఅయి శత్రువు దేశంపై పోరాడి పోరాడారని తెలిపారు. తమ గ్రామ వాసి, దేశం పరువు నిలబెట్టడంలో యుద్ధంలో పాల్గొని రావడం మాకు ఎంతో గర్వంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంఘాల పెద్దలు, మస్జీద్ కమిటీ పెద్దలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైతు భరోసా ఇవ్వాలి

- చెరుకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి



మహాసభలో మాట్లాడుతున్న జీఎస్ గోపి

అమరచింత, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : వానకాలం పంట కోసం ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేయాలని చెరుకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి కోరారు. వనపర్తి జిల్లా, అమరచింత మండల కేంద్రంలోని వాల్మీకి గుడి ఆవరణలో తెలంగాణ రైతు సంఘం రెండవ మహాసభల్లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ. 7,500 చొప్పున రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7 లక్షల మంది రైతులకు రూ. 7,320 కోట్లు రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ముందస్తు వర్షాలు రావడంతో తక్షణమే భరోసా డబ్బులను రైతుల ఖాతాలో జమ చేస్తే, విత్తనాలు ఎరువులు కొనుగోలు చేస్తారని వారన్నారు. మహాసభల్లో సంఘం జిల్లా కోశాధికారి వెంకటేశ్, అజయ్, రాఘవేంద్ర, మోహన్, మహేశ్, మొగులన్న, ఆర్ఎస్ నాగరాజు, శంకర్, అంజిరెడ్డి, చంద్రాయుడు, రాజు, తిరుపతి, శివ, శ్రీను, అంజి తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుతో ఎద్దు మృతి

జడ్చర్ల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పిడుగుపాటుతో ఎద్దు మృతి చెందింది. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలంలోని తుప్పుడుగడ్డతాండ సమీపంలో ఈ సంఘటన జరిగింది. తండాకు చెందిన రైతు జర్పుల శంకర్ శనివారం తన పొలం వద్ద ఉన్న వద్ద ఉన్న చెట్టు వద్ద ఎద్దును కట్టేసాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో పిడుగు పడటంతో ఎద్దు మృతి చెందింది. దాని విలువ లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు తెలిపారు.



తుప్పుడు గడ్డతండా సమీపంలో పిడుగు పడి మృతిచెందిన ఎద్దు వద్ద రోదిస్తున్న రైతు శంకర్

శనీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా తైలాభిషేకాలు



నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీ జేష్టా దేవి సమేత సార్థసప్త శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తిల తైల అభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. మండల పరిధిలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులు, నల్లని వస్త్రంతో పూజలు ఘనంగా చేశారు. శనీశ్వర స్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆవరణలోని నందీశ్వరుడికి, పరమశివునికి వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని ప్రధాన అర్చకులు వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి వసతి, అల్పాహారం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు తెలిపారు. కార్యక్రమంలో పూజారులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకరాచారి, వీరశేఖర్, రాజేష్, ప్రభాకర్, పుల్లయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి అంతర్ జిల్లా మహిళల క్రికెట్ లీగ్



మహిళా క్రికెటర్లను క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్(ఫైల్)

(5వపేజీ తరువాయి)

జట్టు రెండు మ్యాచ్‌లు ఆడుతాయి. టోర్నీలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో తుది జట్టుకు ఎంపిక చేస్తారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో పాల్గొంటుంది.

టోర్నీలో ప్రతిభ చాటాలి.....



అంతర్ జిల్లాల మహిళల క్రికెట్ లీగ్‌ను ఈ నెల 9,10 తేదీ వరకు నిర్వహిస్తున్నాం. 30 ఓవర్ల మ్యాచ్‌లు ఉంటాయి. మొదటిసారి మహిళల టోర్నీ నిర్వహణకు హెచ్‌సీఏ అవకాశం కల్పించింది. టోర్నీలో క్రీడాకారులు ప్రతిభ చాటాలి. ప్రతిభ కనబరిచి క్రీడాకారులను రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టులో చోటు లభిస్తుంది. టోర్నీని మహిళా క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి.

- ఎం.రాజశేఖర్, జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి

అంతర్ జిల్లా మహిళల క్రికెట్ లీగ్ వివరాలు ఇలా..

తేదీ	తలబడే జట్టు	వేదిక
జూన్ 9	రెడ్-బూ	మహబూబ్‌నగర్
జూన్ 9	బ్లూ-పింక్	మహబూబ్‌నగర్
జూన్ 10	పింక్-రెడ్	మహబూబ్‌నగర్

జట్టు వివరాలు....

రెడ్ జట్టు..: అనిత(కెప్టెన్), అక్షరరాథోడ్, వైశాలి, అనూష, మహేశ్వరి, మంజు, ప్రతీక, మీనాక్షి, సింధుజా, కీర్తన, గోపిక, యు. కీర్తన, నందిని, లోకేశ్వరి, భానుమతి.

బ్లూ జట్టు....: ఎన్, మంజుల(కెప్టెన్), స్వాతి, కరీన, మనీశా, ప్రవళిక, శ్రావంతి, దివ్య, నిర్మల, తనుజశ్రీ, తేజశ్రీ, శారద, సాయిశృతి, సాయిపవని, స్పందన, సంజన

పింక్ జట్టు...: త్రివేణి(కెప్టెన్), ఇందు, నిహారిక, చంద్రకళ, పవిత్ర, రిషికసాయి, కవిత, మనీశ, వెన్నెల, శైలు, మెఘన, ఎం.నందిని, మౌనిక, పద్మ, ఐశ్వరయ్య.

నకిలీ విత్తనాలపై నిఘా



అమరచింతలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో విత్తనాలను పరిశీలిస్తున్న ఎస్ఐ , వ్యవసాయ శాఖ అధికారులు

వనపర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాలతో రైతులు నష్టపోకుండా అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. వనపర్తి కలెక్టర్ ఆదర్శ్‌సురభి నేతృత్వంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులతో కూడిన ఈ బృందాలు జిల్లా వ్యాప్తంగా ఎరువులు విత్తన దుకాణాలలో తనిఖీలు చేస్తున్నాయి. ఎవరైనా నకిలీ విత్తనాల విక్రయిస్తే పీడీ యాక్టు నమోదు చేయడంతో పాటు విత్తన దుకాణాల లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకోనున్నారు.

సాగుకు సిద్ధమవుతున్న రైతులు

వానకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. జిల్లావ్యాప్తంగా 2లక్షల80వేల ఎకరాల్లో సాగవుతుందనే అంచనాతో వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే రైతులు తమకు కావాల్సిన విత్తనాలను కూడా సమకూర్చుకుంటున్నారు. ఈ నెల రెండో వారంలో విత్తనాలు వేసే అవకాశం ఉంది. కొందరు రైతులు స్థానిక వ్యాపారుల వద్ద విత్తనాలు కొనుగోలు చేస్తుండగా మరికొందరు ఇతర ప్రాంతాల నుంచి తెచ్చుకునే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతీ యేటా నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు.

రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు

ప్రభుత్వ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటు చేశారు.

ఒక్కొక్క టీంలో జిల్లా స్థాయిలో కలెక్టర్, డీఎస్పీ పర్యవేక్షణలో ఇద్దరు ఏడీఏల ఆధ్వర్యంలో తనిఖీలు చేస్తున్నారు. మండల స్థాయిలో ఒక ఏవో, సబ్ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ అధికారులతో కలిసి దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారు. దుకాణాలలో బిల్లులు, లాట్ నెంబర్, విత్తనాల మొలక 75 శాతం వస్తుందా లేదా అనే కోణంలో శాంపిల్స్ తీస్తున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



జిల్లాలో నకిలీ విత్తనాలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రెండు టాస్క్‌ఫోర్స్ టీంలు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నాం. నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారి లైసెన్స్ రద్దు చేసి పీడీ యాక్టు కేసు నమోదు చేస్తాం. రైతులు కొనుగోలు చేసిన బిల్లు, ప్యాకెటును పంట చేతికొచ్చే వరకు దాచి పెట్టుకోవాలి. నష్టపోయినట్లు గుర్తిస్తే వెంటనే మా దృష్టికి తీసుకురావాలి.

- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవిందు నాయక్

విత్తనాలు వేసిన పొలాన్ని దున్నేశారు

- కేసు నమోదు

ఖిల్లాఘణపురం, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : మొక్కజొన్న విత్తనాలు వేసిన పొలాన్ని దున్నేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖిల్లాఘణపురం ఎస్ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన కురువ శాంతన్న 3.15 ఎకరాల పొలంలో మొక్కజొన్న విత్తనాలు వేసుకున్నాడు. ఈ నెల 4న అతడి కుమార్తె చంద్రకళ, అల్లుడు పూల నవీన్‌లు ఉప్పరిపల్లి పెద్ద కురువ రామకృష్ణ సహకారంతో ట్రాక్టర్‌తో పొలంలోకి ప్రవేశించి దున్నేశారు. దీంతో తనకు రూ. 10,500 నష్టం వాటిల్లినట్లు శాంతన్న తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి వామి దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ఉప్పునుంతల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట మండల పరిధిలోని కొరటికల్ గ్రామానికి చెందిన జిల్లెల రవీందర్‌రెడ్డి పొలంలో నిల్వ చేసిన గడ్డి వామి శనివారం దగ్ధమైంది. శనివారం వారి పక్క పొలంలో రైతు వ్యర్థాలకు నిప్పంటించాడు. ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు గడ్డివాముపై పడి మంటలు చెలరేగాయి. గమనించిన రైతు రవీందర్‌రెడ్డి వెంటనే అగ్నిపమాక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి మంటలను ఆర్పే లోపే గడ్డివాము పూర్తిగా కాలి బూడిదయ్యింది. దీంతో దాదాపు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. నాగర్‌కర్నూల్ ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ఆవుల బుచ్చమ్మ(70) ఈ నెల 3వ తేదీన ఇంటి ముందు చెత్తను కాలుస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకొని తీవ్రంగా గాయపడింది. కుటుంబసభ్యులు ఆమెను ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. సంఘటనపై ఆమె అక్క ఆవుల వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కోళ్ల దాణా లారీ బోల్తా



బోల్తా పడిన కోళ్ల దాణా లారీ

కల్వకుర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కోళ్ల దాణా లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపు తప్పి బోల్తాపడింది. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి మండలం మార్చాల సమీపంలో ఈ సంఘటన జరిగింది. కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శనివారం జడ్చర్ల నుంచి కల్వకుర్తి వైపు వస్తున్న కోళ్ల దాణా లోడ్‌తో లారీ, మార్చాల సమీపంలో జడ్చర్ల వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. దీంతో దాణా సంచులన్నీ రోడ్డు మీద పడిపోయాయి. ఎలాంటి ప్రాణనష్టమూ జరగలేదు. రాత్రి 8 గంటల తర్వాత సంచులను తొలగించి, లారీని ఎక్స్‌కవేటర్ సాయంతో సరి చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

గద్వాల క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కులం పేరుతో దూషించిన ఓ వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని కొత్త హౌసింగ్ బోర్డు కాలనీ చెందిన రాజును అదే కాలనీకి చెందిన హరిప్రసాద్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషించారు. సంఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ చోరీ

- సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా గుర్తింపు
- 12 గంటల్లోగా స్వాధీనం



చోరీకి గురైన లారీతో పట్టణ ఎస్ఐ

గద్వాల క్రైం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ యార్డు సమీపంలో నిలిపి ఉంచిన ఓ లారీ చోరీకి గురయ్యింది. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా 12 గంటల్లోగానే దానిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గద్వాల పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మోమిన్‌మొహల్లా కాలనీకి చెందిన ముస్తాక్ శుక్రవారం తన లారీని మార్కెట్ యార్డ్ సమీపంలో నిలిపి ఉంచగా, చోరీకి గురయ్యింది. దీంతో మధ్యాహ్నం 12 గంటలకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లారీ విలువ రూ. 25 లక్షలు ఉంటుందని తెలిపారు. దీంతో పట్టణ ఎస్ఐ సిబ్బందిని అప్రమత్తం చేసి, విచారణ చేపట్టారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ఆ లారీ ఎటువైపు వెళ్లిందో పరిశీలించారు. అది ఏ టోల్‌ప్లాజానూ దాటిపోలేదని గుర్తించారు. దాని కోసం జిల్లా అంతటా గాలించినా ఆచూకీ లభించలేదు. తర్వాత సీసీ కెమెరా ఫుటేజీలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారు. దాని ఆధారంగా ఎస్ఐ తన సిబ్బందితో కలిసి గాలింపు మొదలు పెట్టారు. లారీ టోల్‌ప్లాజాల వైపు వెళ్లకుండా పెబ్బేరు, వనపర్తి, బిజినేపల్లి, తిమ్మాజిపల్లి గ్రామాలను దాటి పోయినట్లు గుర్తించారు. ఆ తర్వాత జడ్చర్ల సమీపంలో దొంగలు లారీ నెంబర్ ప్లేట్‌ను మార్చేశారు. దీంతో బాలానగర్ టోల్‌ప్లాజా దగ్గర సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించగా లారీ ప్లాజాను దాటి వెళ్లలేదని తేలింది. దీంతో పట్టణ ఎస్ఐ, సిబ్బందితో కలిసి వెనుకకు వస్తుండగా బాలానగర్ సమీపంలో రోడ్డు పక్కన లారీ ఆగి ఉన్నట్లు గుర్తించి, పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అలాగే ఓ అనుమానితుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. మొత్తానికి చోరీకి గురైన లారీని పోలీసులు సాంకేతిక నైపుణ్యంతో 12 గంటల వ్యవధిలోనే ట్రాక్ చేసి గుర్తించారు.

సీటు కోసం మహిళల కొట్లాట

- పోలీస్ స్టేషన్ ముందు బస్సు ఆపిన డ్రైవర్
- ఇద్దరు మహిళలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు


బస్సులో గొడవ పడుతున్న మహిళలు

వనపర్తి రూరల్, జూన్ 7(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సులో సీటు కోసం ఇద్దరు మహిళల మధ్య జరిగిన కొట్లాట చివరకు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు లు చేసుకునేంత వరకు వెళ్లింది. వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు జిల్లా కేంద్రం నుంచి బుసిరెడ్డిపల్లికి వెళ్లి తిరిగి రాయినిపల్లి, మాందాపూ ర్, చింతకుంట, చందాపూర్‌ల మీదుగా వనపర్తి బస్టాండ్‌కు చేరుకుం టుంది. శనివారం బుసిరెడ్డిపల్లి నుంచి వచ్చేటప్పుడు సీట్లు మొత్తం నిండిపోవడంతో మాందాపూర్ వద్ద డ్రైవర్ బస్సును ఆపలేదు. అక్కడే ఉన్న మహిళలు రోడ్డుకు అడ్డంగా నిలబడి బస్సును ఆపి ఎక్కారు. ఆ తర్వాత చందాపూర్ వద్ద కూడా కొందరు మహిళలు బస్సు ఎక్కారు. వారిలో ఒక మహిళ ఫుట్‌పాత్ మెట్లపై కూర్చోవడంతో, మరో మహిళ అభ్యంతరం తెలిపింది. అక్కడ ఎందుకు కూర్చున్నావని నిలదీసింది. దీంతో వారిద్దరి మధ్య వాగ్వాదం చెలరేగి కొట్లాటగా మారింది. డ్రైవర్, కండక్టర్ సహా తోటి మహిళలు సర్దిచెప్పినా ఫలితం లేకపోయింది. దీంతో చేసేదేమీ లేక డ్రైవర్ రూరల్ పోలీస్‌స్టేషన్ ముందు బస్సు ఆపి ఎస్ఐకి విషయం తెలిపారు. గొడవపడిన ఇద్దరు మహిళలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. కడుకుంట్ల గ్రామంలోనూ ఇలాంటి సంఘటనే జరిగింది.

కడుపు నొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

దామరగిద్ద, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కడుపు నొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండల పరిధిలోని మొగల్‌మడ్క గ్రామంలో ఈ సంఘటన జరిగింది. దామరగిద్ద ఎస్ఐ పి.రాజు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన రాములుగౌడ్ (37)గత కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. శనివారం నొప్పి తీవ్రం కావడంతో ఇంటి ముందున్న వేప చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. భార్య సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

కల్వకుర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన అర్జున్ (30) అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం... నేరటి అర్జున్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని పార్కింగ్‌లో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పని ముగించుకొని ఇంటికి వెళ్లి పడుకొన్నారు. పక్క ఇంట్లో నివసించే అతడి సోదరుడు రవి రాత్రి 8 గంటల సమయంలో వచ్చి చూడగా, అప్పటికే అర్జున్ మృతి చెంది ఉన్నాడు. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కకాటుతో ముగ్గురికి గాయాలు

మానవపాడు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, మానవపాడు మండల పరిధిలోని చెన్నిపాడు గ్రామంలో కుక్క కాటుతో ముగ్గురు గాయపడ్డారు. శనివారం గ్రామానికి చెందిన బీసన్న, మానవపాడు మండల కేంద్రానికి చెందిన రామస్వామితో పాటు మరొకరిని కుక్క కరిచింది. గ్రామంలో కుక్కల బెడద రోజు రోజుకూ తీవ్రం అవుతోందని స్థానికులు చెప్తున్నారు. నెల రోజుల్లో 8 మంది కుక్కల దాడిలో గాయపడ్డారని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.


జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోకి వెళ్తున్న వరద


దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఉత్పత్తి చేసే టర్బైన్లు

విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం 610 మిలియన్ యూనిట్లు

- 'జూరాల'కు స్వల్పంగా కొనసాగుతున్న వరద
- ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి
- ఇన్‌ఫ్లో ఆధారంగా ఉత్పత్తి పెంచే అవకాశం



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం

ఆత్మకూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో వారం రోజుల క్రితం 8 యూనిట్లను ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. లక్ష్యానికి అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే రావడంతో ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి జూరాల జలాశయానికి వరద ప్రారంభమైంది. అంతకు ముందే ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తికి యూనిట్లను సిద్ధం చేసుకున్నారు. దీంతో వరద మొదలవగానే యూనిట్లను ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. గత ఏడాది ప్రాజెక్టుకు వరద పుష్కలంగా రావడంతో 600 మిలియన్ యూనిట్ల లక్ష్యానికి మించి 678 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్ప త్తి చేశారు. ఈ ఏడాది కూడా ముందుగానే వరద ప్రారంభం కావడంతో 610 మిలియన్ యూనిట్ల లక్ష్యం చేరేందుకు కృషి చేస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

2 విద్యుత్ కేంద్రాల్లో 12 యూనిట్లు

ఎగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని 6 యూనిట్ల ద్వారా ఒక్కో యూనిట్‌కు 39 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు అవకాశం ఉంది. దిగువ జూరాల జల ఉత్పత్తి కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా ఒక్కో యూనిట్‌కు 40 మెగావాట్ల ఉత్పత్తిని కొనసాగించేందుకు వీలుంది. కానీ ఎగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలోని మూడవ యూనిట్‌లో సాంకేతిక లోపం కారణంగా రెండు సంవత్సరాలుగా ఉత్పత్తి చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో చైనాకు చెందిన సాంకేతిక నిపుణులు మరమ్మతు చేపట్టారు. వచ్చే నెల చివరి వారం నాటికి సమస్య పరిష్కారమై, మూడో యూనిట్ కూడా వినియోగంలోకి వస్తుందని అధికారులు చెప్తున్నారు. ఈ ఏడాది దిగువ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 290 మిలియన్ యూనిట్లు, ఎగువ కేంద్రంలో 5 యూనిట్ల ద్వారా 320 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రస్తుతం ఎగువ నుంచి వరద స్వల్పంగా వస్తున్నందున ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో నాలుగు యూనిట్లను ప్రారంభించి ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

వరదను బట్టి విద్యుత్ ఉత్పత్తి

ఎగువన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురుస్తున్నందున లక్ష్యాన్ని చేరుకుంటామని ప్రాజెక్టు అధికారులు చెప్తున్నారు. రోజు వారీగా ప్రాజెక్టుకు ఒక టీఎంసీ నీరు వస్తే ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తిని వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. అలాగే రోజుకు రెండు టీఎంసీల నీరు వస్తే దిగువ జూరాల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తి నిలిచిపోయే అవకాశం ఉంటుంది. విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలయ్యే నీరు సమృద్ధిగా ముందుకెళ్లే వీలుండదు. అందుకే విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోతుంది. అందుకోసం సమృద్ధిగా వరద నీరు ముందుకు వెళ్లేలా ఏర్పాట్లు చేసేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

లక్ష్యాన్ని చేరుకుంటాం



ఈ ఏడాది 610 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా ఉంది. ఎగువ నుంచి వచ్చే వరదకు అనుగుణంగా యూనిట్లను ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగించే అవకాశం ఉంది. గత ఏడాది జూన్ చివరి మాసంలో ఉత్పత్తి ప్రారంభం అయ్యింది. ఈ ఏడాది ప్రాజెక్టుకు ముందుగానే వరద రావడంతో లక్ష్యాన్ని చేరుకోవడం సులభం కానుంది. వరద ఇంకాస్త పెరిగితే రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది.

- శ్రీధర్, ఎస్ఈ

ఐదు సంవత్సరాలుగా విద్యుత్ ఉత్పత్తి (ఎంయూ)

సంవత్సరం	ఎగువ	దిగువ
2020-21	370	405
2021-22	335	369
2022-23	450	426
2023-24	101	111
2024-25	345	333

అత్యధికంగా 2020-21లో 775 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కొనసాగించి రికార్డును నెలకొల్పారు. అయితే 2024లో ఎగువ నుంచి వరద అత్యల్పంగా రావడంతో 212 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని రాబట్టినట్లు అధికారులు తెలిపారు. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో 27 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు చెప్పారు. గత రెండు రోజులుగా ఎగువ నుంచి వరద నిలిచిపోవడంతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసినట్లు తెలిపారు.

అన్యాయం జరిగితే ఉద్యమం

- తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు


కొత్తకోట బడిబాటలో మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు

కొత్తకోట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అన్యాయం జరిగితే ఉద్యమిస్తామని తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు హెచ్చరించారు. వనపర్తి జిల్లా, కొత్తకోటలో శనివారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మండల నాయకులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో వలంటీర్లను నియమించాలన్నారు. 30 మంది విద్యార్థులున్న పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు, 50 మంది విద్యార్థులకు పైగా ఉన్న ప్రతీ పాఠశాలల్లో అయిదుగురు ఉ పాధ్యాయులు, తరగతికి ఒకరు ఉండేటట్లు చూడాలన్నారు. 220 కన్నా ఎక్కువ మంది వి ద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఇద్దరు సోషల్ టీచర్లను కేటాయించాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ఐదు డీఏలను వెంటనే వడుదల చే యాలని, పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో ఎంఈవో కృష్ణయ్య, నోడల్ అధికారి కరుమయ్య, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివేకానంద, తపస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అమరేందర్‌రెడ్డి, విష్ణువర్ధన్, ఉపాధ్యక్షులు దేవన్న, శివనారాయణ, లక్ష్మయ్య, రాములు, అరవింద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, రాధిక, మునేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- గద్వాల డీవైఎస్‌వో జితేందర్
- ముగిసిన వేసవి శిక్షణ శిబిరాలు


ఫుట్‌బాల్ క్రీడాకారులతో డీవైఎస్‌వో, సీనియర్ క్రీడాకారులు

గద్వాల అర్బన్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరూ చిన్న వయసు నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని జోగుళాంబ గద్వాల జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి (డీవైఎస్‌వో) జితేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం, సోమనాద్రి ఫుట్‌బాల్ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాలు ముగిశాయి. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయనతో పాటు ఇంటెలిజెన్స్ సీఐ విజయ్‌సింహ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తిని పెంచేలా గత నెల ఒకటి నుంచి ఈనెల 6 వరకు జిల్లా వ్యాప్తంగా 13 కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరాల్లో 400 మంది చిన్నారులు వేర్వేరు క్రీడాంశాల్లో శిక్షణ పొందారన్నారు. శిక్షణ పొందిన వారు పాఠశాలల్లో జరిగే క్రీడల్లో పాల్గొని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ కోచ్ విజయ్‌కుమార్, కరాటే మాస్టర్ శ్రీహరి, కబడ్డీ కోచ్ రజనీకాంత్, బీసన్న, కోచ్‌లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పానీపూరి తిని అస్వస్థత

- ఆసుపత్రి పాలైన ఆరుగురు
- ఒకరి పరిస్థితి ఆందోళనకరం


వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు కార్తీక్

పెబ్బేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పానీ పూరి తిని ఆరుగురు అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. వనపర్తి జిల్లా, పెబ్బేరు మునిసిపాలిటీలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ రెండవ గేటు వద్ద ఉన్న పానీపూరీ బండి వద్ద గురువారం సాయంత్రం కార్తీక్ అనే యువకుడు పానీపూరీ పార్సిల్ తీసుకొని ఇంటికి వెళ్లాడు. కార్తీక్‌తో పాటు అతడి సోదరి పద్మావతి, ఆమె కుమార్తెలు జ్ఞానేశ్వరి, మాధవి, మానస, కుమారుడు దినేష్ పానీపూరీ తిన్నారు. మరుసటి రోజు శుక్రవారం వారందరూ తలనొప్పి, కడుపునొప్పి, జ్వరం, వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. వారిలో జ్ఞానేశ్వరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, మిగతా ఐదుగురి పరిస్థితి మెరుగుపడిందని వైద్యులు తెలిపారు. వారితో పాటు అదే కుటుంబానికి చెందిన కళావతి పానీ తాగకుండా కేవలం గప్‌చుప్‌లు తినడం వల్ల అస్వస్థతకు గురికాలేదు.

కంటైనర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఎర్రవల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కంటైనర్ లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి ఇటిక్యాల ఎస్ఐ వెంకటేశ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలం గోనుపాడు గ్రామానికి చెందిన కుర్వ రాముడుతో పాటు మరో ఇద్దరు బొలెరో వాహనంలో పెబ్బేరు సంతకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గంమధ్యలో నేషనల్ హైవే - 44పై బీచుపల్లి కృష్ణానది బ్రిడ్జి దగ్గర టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో వాహనాన్ని రోడ్డుపక్కనే ఆపి టైర్‌ను సరిచేసుకున్నారు. తిరిగి బోలేరో వాహనం ఎక్కుతుండగా, వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ లారీ కుర్వ రాముడిని ఢీకొన్నది. దీంతో అతడికి కాళ్లతో పాటు పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే కర్నూల్ అసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతడి చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సంఘటనపై కుర్వ మద్దిలేటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

ఖిల్లాఘణపురం, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : దొంగతనం కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఖిల్లాఘణపురం ఎస్ఐ సురేశ్‌గౌడ్ తెలిపారు. వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండలంలోని వెంకటాంపల్లి గ్రామానికి చెందిన దేవరశెట్టి వెంకటేశ్ ఇంటిలో ఈ నెల 5న ఏడున్నర తులాల వెండి, రూ. 30 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా అదే గ్రామానికి చెందిన చిలుక చెన్నయ్యను అదుపులోకి తీసుకున్నారు. నేరం చేసినట్లు అతడు విచారణలో అంగీకరించడంతో శనివారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

ఉదయపు నడకతో ఆరోగ్యం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- పెద్దదగడలో మార్నింగ్ వాక్


పెద్దదగడలో నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ చేస్తున్న మంత్రి జూపల్లి

చిన్నంబావి, మే 7 (ఆంధ్రజ్యోతి) : ఉదయపు నడకతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వనపర్తి జిల్లా, చిన్నంబావి మండల పరిధిలోని పెద్దదగడ గ్రామంలో శనివారం గ్రామస్థులు, నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. అనంతరం కొప్పునూరు శివారులో నిర్మించిన బీరప్ప గుడి ప్రారంభోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. చుట్టు ప్రక్కల గ్రామాలతో పాటు, రాయలసీమ ప్రాంతానికి చెందిన వారు ఆలయాన్ని దర్శించుకుంటారని స్థానికులు మంత్రికి తెలిపారు. ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరగా, ప్రభుత్వం నుంచి రూ. 5 లక్షలు ఇప్పించేందుకు కృషి చేస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. ఆ తర్వాత అనారోగ్యంతో బాధపడుతున్న కొప్పునూరు సింగిల్ విండో డైరెక్టర్ పూలమాల భక్తిరెడ్డిని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల నాయకులు కృష్ణప్రసాద్, బీమపల్లియాదవ్, చంద్రశేఖర్, బాలుయాదవ్, చక్రధర్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కాశన్న, విష్ణు, రమేశ్, భరత్, తెలుగు గోవిందు ఉన్నారు.

మీడియా, రైతులపై కేసులను ఎత్తివేయాలి

- పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రైతులతో పాటు, ఒక దినపత్రిక సంపాదకుడిపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ నియోజకవర్గం, రాజోలు మండలంలోని పెద్దధన్వాడలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు 2023లో అప్పటి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని పేర్కొన్నారు. నాటి నుంచి అక్కడి 12 గ్రామాల రైతులు, ప్రజలు ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయవద్దని అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించుకున్నారని తెలిపారు. న్యాయం కోసం వారు శాంతియుతంగా నిరసన దీక్షలు చేపట్టారని గుర్తు చేశారు. రైతులు, ప్రజల ఆందోళనలపై ఆ ప్రాంతవాసి, ఓ పత్రిక సంపాదకుడు వార్తలు రాయటంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల కంపెనీ నిర్మాణానికి ఏర్పాట్లు చేపట్టడంతో రైతులు, ప్రజలు అడ్డుకొని ప్రశ్నించారని తెలిపారు. దీంతో పరిశ్రమకు చెందిన బౌన్సర్లు ప్రజలు, రైతులపై దాడి చేశారని పేర్కొన్నారు. దాడిలో మరియమ్మ అనే మహిళ తీవ్రంగ గాయపడిందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని కోరారు.

ఇంటర్వ్యూ..

రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎండీ యూసుఫ్ అలీ, తహసీల్దార్



ఊర్కొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎండీ యూసుఫ్ అలీ అన్నారు. ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు ఆయన వెల్లడించారు.

రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశ్యం?

గ్రామాల్లో నెలకొన్న భూ సంబంధిత సమస్యల పరిష్కారమే రెవెన్యూ సదస్సుల ముఖ్య ఉద్దేశ్యం. భూ భారతి చట్టం-2025 ద్వారా భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రభుత్వం సదస్సులు నిర్వహిస్తున్నది. ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఏం చేస్తారు?

రైతుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాము. సమస్యల ప్రకారంగా దరఖాస్తులను వర్గీకరించి, పక్కాగా రికార్డును తయారు చేస్తున్నాము. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించే వాటికి అప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాము.

గతంలోనూ ఇలాగే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశారు కదా?

భూ భారతిలో అటువంటి సమస్య రాదు. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. స్వీకరించిన ప్రతీ దరఖాస్తుకు రశీదు ఇస్తున్నాము. సదస్సులు ముగిసిన తర్వాత క్షేత్ర స్థాయిలో విచారణ అవసరం ఉండే సమస్యలపైనా నిశితంగా దృష్టి పెట్టి పరిష్కరించడానికి కృషి చేస్తాము. ఒకవేళ సమస్య పరిష్కరించడానికి నిబంధనలు అనుమతించని పక్షంలో రైతులకు స్పష్టంగా కారణాలు తెలియజేస్తాము. రైతులను మాత్రము కార్యాలయాల చుట్టూ తిప్పుకోము.

న్యూస్ బాక్స్

డీఏలపై ప్రభుత్వ నిర్ణయం సరికాదు : టీఎస్‌యూటీఎఫ్

వంగూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఏ నిరాశపర్చిందని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు చిన్నయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రెండు డీఏలు ఇస్తామని చెప్పి ఆరు నెలల తర్వాత అంటూ మెలిక పెట్టడం సరికాదన్నారు. ఐదు పెండింగ్ డీఏలకు గాను ఒకటి ప్రకటించడం అన్యాయమని, ఉద్యోగులకు రావాల్సిన పీఆర్సీని 2023 నుంచి మంజూరు చేయాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

కోడేరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడేరు, తీగలపల్లి, రాజాపూర్, తుర్కదిన్నె సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో స్వల్ప మార్పులు చేసినట్లు విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మన్ ప్రభాకర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ వైర్లకు తగిలేలా ఉన్న చెట్లను తొలగించడానికి విద్యుత్‌ను ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు నిలిపేయనున్నట్లు తెలిపారు. ఈ విషయం విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బల్మూరు ఎస్ఐగా రాజేందర్



బల్మూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల పోలీస్ స్టేషన్‌కు నూతనంగా ఎస్ఐగా రాజేందర్ బాధితులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ రమాదేవి నాగర్‌కర్నూల్ జిల్లా వీఆర్‌కు వెళ్లినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలను గౌరవించే వారిని గౌరవిస్తామని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని, బాధితులు ఎవరైనా సరే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. వాహనదారులు హెల్మెట్లు ధరించి వాహనాలను నడుపుకోవాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి : ఎంఈవో



అమ్రాబాద్‌లో ఓ ఇంటివద్ద తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అమ్రాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి మండలంలోని గ్రామాల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలోని కాలనీలలో మండల విద్యాధికారి బాలకిషన్‌తో పాటు సీపీఎస్ ప్రధానోపాధ్యాయులు విజయ్‌మోహన్, పలువురు ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు ఇళ్ల వద్ద విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎంఆర్సీలో పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి బాలకిషన్ పాఠ్య పుస్తకాలను అందజేశారు.



కల్వకుర్తిలో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



కొల్లాపూర్‌లో ముస్లిం మత పెద్దలను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు

ముస్లింల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- బక్రీద్ వేడుకల్లో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి
- భక్తిశ్రద్ధలతో వేడుకలు
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు



పెద్దకొత్తపల్లి : యాపట్ల ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కల్వకుర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం మైనార్టీల సంక్షేమానికి సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పలు ఈద్గాల వద్ద బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలకు కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కు మార్‌తో కలిసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. పలు పార్టీల నాయకులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఈద్ ఉల్ జుహ

కొల్లాపూర్ : త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ (ఈద్ ఉల్ జుహ) వేడుకలను కొల్లాపూర్ మండలంలో శనివా రం ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. కొల్లాపూర్‌లోని జామ మసీదులో శనివారం ఉదయం ఈద్‌ఉల్ జుహ అనంతరం ర్యాలీగా వెళ్లి పట్టణంలోని ఖాదర్‌పాషా దర్గా వద్ద ఉన్న ఈద్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలు హఫీజ్ హషీం సుత్తారి, హఫీజ్ అయుబ్ ఖాన్ బక్రీద్ విశిష్టతను ముస్లింలకు వివరించారు. ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. వివిధ పార్టీల నేతలు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్ : బక్రీద్ వేడుకలను పట్టణంలోని జమ మసీద్, బిజాన్‌బి, మదీనమసీద్‌ల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని ముస్లింలకు శుభాంకాక్షలు తెలియజేశారు. గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, గౌరీశంకర్‌తోపాటు మాజీ మునిసిపల్ చైర్మన్ నర్సింహ్మా గౌడ్, బీఆర్ఎస్ నాయకులు రాంబాబు, అచ్చంపేట డీఎస్పి శ్రీనివాసులు, సీఐ నాగరాజు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.

తాడూరు, తిమ్మాజిపేట, వంగూరు, చారకొండ, ఊర్కొండ, పెద్దకొత్తపల్లి, బిజినేపల్లి, అమ్రాబాద్, దోమల పెంట ప్రాంతాల్లోనూ ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేకప్రార్థనలు చేశారు. పండుగ సందర్భంగా ముస్లింలకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు ఈద్గాల వద్దకు వెళ్లి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



తిమ్మాజిపేటలో ముస్లింలకు ఈద్‌ముబారక్ తెలుపుతున్న పార్టీల నాయకులు, స్థానిక ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి



వంగూరులో బక్రీద్ వేడుకల్లో ముస్లింలు



తాడూరు మండలం పాపగల్‌లో ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు



ఊర్కొండపేట ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



దోమలపెంటలో ఈద్గా వద్ద ముస్లింలు

కల్వకోల్‌లో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కల్వకోల్‌లోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన ధ్వజస్తంభాన్ని పూజిస్తున్న దాతలు జూపల్లి భాగ్యమ్మ, రఘుపతిరావు దంపతులు

పెద్దకొత్తపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కల్వకోల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన చెన్నకేశవ స్వామి ఆలయంలో శ్రీలక్ష్మీచెన్నకేశవ, గణపతి విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం బ్రాహ్మణులు వేద మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య వైభవోపేతంగా జరిగింది. దాతలు జూపల్లిపల్లి భాగ్యమ్మ, రఘుపతి రావు దంపతులు, కొండా అలివేల, శ్రీను సాగర్ దంపతులు, బంటు శ్రీనివాస్ స్వామివా ర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంధువుల రాకతో కల్వకో గ్రామం సందడిగా మారింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం చేస్తున్న మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్

కల్వకుర్తి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన నేరటి అర్జున్ మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించి మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని ఆనంద్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న దేశ్యానాయక్

ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలి : సీపీఎం

ఉప్పునుంతల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్ దేశ్యానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఉప్పునుంతలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వానాకాలం పంటల సాగు ప్రారంభమైందని, వెంటనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతుభరోసా జమ చేయాలని కోరారు. అదే విధంగా విత్తన చట్టాన్ని ఆమోదించాలని ఆయన డిమాండ్ చేశారు. విత్తనాలు, ఎరువుల సమస్యలపై ఈ నెల 11న జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామాల నుంచి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, శివకుమార్, కిష్టయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం

- క్రికెట్ పోటీలను ప్రారంభించిన కాంగ్రెస్ నాయకుడు పగిడాల శ్రీనివాసులు

పెద్దకొత్తపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు ఆడడం వల్ల యువతలో మానసికోల్లాసంతో పాటు దేహదారుఢ్యం బలపడుతుం దని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు డాక్టర్ పగడాల శ్రీనివాసులు అన్నారు. శనివారం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో దండు యువసేన ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-2లో పూజ చేసి అనంతరం మొదటి మ్యాచ్ జొన్నలబొగుడ, సాతాపూర్ గ్రామాల జట్ల మధ్య టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించి బ్యాటింగ్ చేశారు. యూత్‌ను క్రీడారంగాల్లో ప్రోత్సహిస్తున్న దండు నరసింహకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన విజయ తెలంగాణ డెయిరీ పార్లర్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే దేవునితిర్మలాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కావలి చిన్నస్వామి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి మాజీ సర్పంచ్‌లు ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యం, సర్పంచ్ చిన్నయ్య, వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ సభ్యులు దండు నరసింహ, బద్యనాయక్, రవికుమార్, ధర్మేందర్, బాలునాయక్, తిరుపతమ్మ, వెంకటస్వామి గౌడ్, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, పెద్దకొత్తపల్లి మత్స్యకార సంఘం మండల అధ్యక్షుడు గడ్డిగోపుల ఎల్లయ్య పాల్గొన్నారు.

పేదల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట



తాడూరులో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ

తాడూరు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభు త్వం పెద్దపీట వేస్తున్నదని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

తెలకపల్లి : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని, రాని వారు ఎవరూ బాధపడాల్సిన అవసరం లేదని, రెండో విడతలో కూడా అందజేస్తామన్నారు. గత ప్రభుత్వంలో డబుల్ బెడ్‌రూమ్‌లు అందజేస్తామని చెప్పిన నిరుపేదకు అందలేదని ఆయన అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీడీవో అంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, హౌసింగ్ పీడీ సంగప్ప, ఏఈ రాజావర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంధ్య, రేణుక, నాగర్‌కర్నూల్ యూత్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, మల్లయ్య, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రజలు, లబ్ధిదారులు, మార్కెట్ వైస్ చైర్మన్ జంగయ్య, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్య, మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, ఎంపీడీవో శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు శ్రీనివాసులు, అధికారులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు

కందనూలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీపురం శ్రీరంగనాయకస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ నెల 4న ప్రారంభమైన ఉత్సవాల్లో చివరి రోజున మహాపూర్ణాహుతి అనంతరం పల్లకి సేవ, చక్రస్నానం, ద్వాదశారాధన, సప్తవరణాలు తదితర పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం ఆవరణలో చంద్రపుష్కరిణిలో భక్తులు పవిత్రస్నానం ఆచరించారు.

అవినీతి లేకుండా పథకాల అమలు

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



అమ్రాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అమ్రాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో కానీ, రాజీవ్ యువ వి కాసం పథకంతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను ఎలాంటి అవినీతి, అక్ర మాలకు తావు లేకుండా అమలు చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంకెగార్డెన్స్ ఫంక్షన్ హాల్‌లో అమ్రాబాద్, పదర మండలాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలోని అన్ని వర్గాల రైతులకు ఇందిర సౌర జలగిరి వికాస పథకం అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ జిల్లా పీడీ సంగప్ప, అమ్రాబాద్ ఎంపీడీవో లింగయ్య, పదర ఎంపీడీవో వెంకటయ్య, అచ్చంపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాసు మల్ల వెంకటయ్య, రెండు మండ లాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హరినారాయణగౌడ్, రామలింగయ్య యాదవ్, నాయకులు మల్లికార్జున్, బాల్‌లింగంగౌడ్, రేణయ్య, రాజగోపాల్, నారాయణ ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఉప్పునుంతల : మండల పరిధిలోని లత్తీపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు లచ్చింపతి సోదరుడు సర్వారంనాయక్ మృతి చెందగా, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శనివారం పరామర్శించారు. చారకొండ మండలం గోకారం గ్రామం సమీపంలో సర్వారంనాయక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలపాలవగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకొని బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనంతారెడ్డి, నాయకులు శేఖర్‌గౌడ్, జగన్, నరేష్ ఉన్నారు.

రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలి

- యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదానం

కందనూలు, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని యువ శక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన తిరుపతయ్య రక్తహీనతతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సకు చేరారు. వైద్యులు రక్తం తక్కువగా ఉందని, ఏబీ పాజిటివ్ రక్తం వెంటనే ఎక్కించాలనడంతో యువశక్తి ఫౌండేషన్ దమిషన్ సభ్యులు ప్రదీప్ వెంటనే స్పందించి అతనికి రక్తం ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. మధు మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని, ఆపదలో ప్రాణాపాయ స్థితిలో రక్తం అవసరమైన వారు 9949446340, 9908806285 నెంబర్లలో సంప్రదించాలన్నారు. రక్తదానం చేసిన యువతను అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

- ఎంఈవో సత్యనారాయణశెట్టి



అవంచలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో సత్యనారాయణశెట్టి

తిమ్మాజిపేట, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యమని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణశెట్టి అన్నారు. మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో శనివారం బడిబాట కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం ద్వారానే పిల్లల భవిష్యత్తు ఉందని, బడి బయట ఉన్న బడిఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విశాలమైన తరగతి గదులు ఉంటాయని, తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన చేస్తున్నట్లు తెలిపారు. నేరేళ్లపల్లి, బుద్ధసముద్రం, రాళ్లచెరువుతండాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు సరిత, శారద, భాగ్య పాల్గొన్నారు.

బడిబాట తర్వాతే సర్దుబాటు చేయండి

పెద్దకొత్తపల్లి : ఈ బడిబాట కార్యక్రమం తర్వాతనే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎండీ గౌస్‌పాషా, డి.మల్లయ్య ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక వైపు విద్యార్థుల న మోదు పెంచేందుకు బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వ హించాలని ఉత్తర్వులు జారీ చేసిందని, ఒక వైపు విద్యార్థుల నమోదు పెంచమంటూనే మరో వైపు ఉపాధ్యాయుల సర్దుబాటును ఈ నెల13లోగా ముగించా లని ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఈ బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున పెరిగిన సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు చేస్తే న్యాయబద్ధంగా ఉంటుందని వారు ప్రభుత్వానికి సూచించారు.